క్లుప్తంగా

అంగన్‌వాడీలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలతో కలసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలకు వ్యతిరేకంగా జీఓలు తెచ్చి ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పనిభారం ఎక్కువై అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతుంటే, ఫేస్‌యాప్ పెట్టడం మంచిది కాదని తెలిపారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యదర్శి విజయ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బలక్ష్మి, లక్ష్మీదేవి, సాల్మన్, సునీత పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక కూరగాయల మార్కెట్‌లో బుధవారం దివ్యాంగురాలు మల్లేశ్వరి కూతురి వివాహానికి టమోటా వ్యాపారి మల్లికార్జున, శ్రీలక్ష్మీ కుబేర స్వర్ణ భైరవ ట్రస్టు ఆధ్వర్యంలో బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు, కూరగాయలు అందించారు. ఈ సందర్భంగా ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల, వయోవృద్ధుల సేవా సొసైటీ కన్వీనర్ అఫ్జల్, గౌరవాధ్యక్షుడు చలపతి రావు మాట్లాడుతూ దివ్యాంగురాలు మల్లేశ్వరి టైలరింగ్ పనిచేస్తూ ముగ్గురు కుమార్తెలను పోషిస్తోందన్నారు. ఆమె రెండో కుమార్తె వివాహం ఈనెల 26న గురువారం నిర్వహిస్తున్నారని తెలిపారు

స్వార్థ చింతన పెరగడం దురదృష్టకరం

ప్రొద్దుటూరు : నేటి యువతలో దేశభక్తి తగ్గి స్వార్థ చింతన పెరగడం దురదృష్టకరమని స్వాతంత్య్ర సమరయోధుల, వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు టీకూరు సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్య్ర సమరయోధులైన కడప కోటిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, టీకూరు సుబ్బారావు, సీతారామయ్య, చవ్వా బాలిరెడ్డి, దేవిరెడ్డి రామసుబ్బారెడ్డి, వేల్పుల సుబ్బయ్య, వల్లపు వెంకటసుబ్బయ్య, పెడబల్లె బాల యల్లారెడ్డి సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. నేటి యువతలో జాతీయ భావాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

చండీ హోమం

మైదుకూరు : మైదుకూరు అమ్మవారిశాలలో బుధవారం మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చండీ పారాయణం, చండీ హోమం నిర్వహించి, మహా మంగళహారతి ఇచ్చారు. ప్రొద్దుటూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మైదుకూరు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు సూరిశెట్టి శివవెంకటప్రసాద్ ఆయనను శాలువాతో సత్కరించారు. ఆర్యవైశ్యసభ కార్యదర్శి యలవలి హరికిషన్, ఉపకోశాధికారి ఎలిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు



రాజుపాళెంలో సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రాజుపాళెం : పార్టీలకు అతీతంగా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలూరు ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ జగనన్న పాలనలో ఏ మేరకు లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరించారు. అనంతరం సీసీ రోడ్లు వేయాలని, పక్కా ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో చంద్రబాబు ప్రభుత్వంలో రెండు వేల ఇళ్లకు బిల్లులు ఇవ్వలేదని, వారంతా తమ సొంత డబ్బుతో ఇంటిని నిర్మించుకున్నారన్నారు. ప్రస్తుతం వారంతా బిల్లులు మంజూరు చేయాలని అడుగుతున్నారని, దీనికి టీడీపీ నాయకులే సమాధానం చెప్పాలని తెలిపారు. తమ ప్రభుత్వంలో మంజూరు చేసిన పక్కా ఇళ్లకు వెనువెంటనే బిల్లులు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, సర్పంచ్ షాజియ, వైఎస్సార్‌సీపీ నాయకులు బూతూరు వెంకటరామిరెడ్డి, నంద్యాల రామకృష్ణారెడ్డి, నంద్యాల ప్రతాప్‌రెడ్డి, పాలూరు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ టంగుటూరు మారుతి ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డి, సచివాలయ సిబ్బంది, ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



గంగిరెడ్డిపల్లెలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : అర్హత కల్గిన ప్రతి నిరుపేదకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని సోమిరెడ్డిపల్లె -3 గ్రామ సచివాలయం పరిధిలో గంగిరెడ్డిపల్లె, ఆనంద ఆశ్రమం, నరసన్నపల్లె వీవర్స్ కాలనీలలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం పథకాలు పొందినట్లు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గంగిరెడ్డిపల్లెలో స్థానిక ప్రజలు విద్యుత్, డ్రైనేజీ, భూ సమస్యలు ఉన్నట్లు తెలిపారు. వీవర్స్ కాలనీలో సీసీరోడ్లు వేయాలని కావాలని కోరారు. రజకులు దోబీఘాట్ ఏర్పాటు చేయించాలని విన్నవించారు. అనంతరం గ్రామంలో పలువురు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, ఎంపీపీ వీరనారాయణరెడ్డి, సింగల్ విండోఅధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, సర్పంచ్ సోమిరెడ్డిపల్లె రామయ్య, ఎంపీటీసీ పోలు అంకిరెడ్డి, సచివాలయం కన్వీనర్లు అంకిరెడ్డిపల్లె రామిరెడ్డి, పోలు పెద్ద అంకిరెడ్డి, యాదాల లక్ష్మిత్రీవాణి ఎంపీడీఓ వెంగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి



గోపవరంలో పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గోపవరం : మండలంలో సాగైన వివిధ పంటలను రైతులు పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి అరవిందనాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని గోపవరంలో పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయే పంటలు సాగు చేశారో రైతులు ఆర్బీకే వద్దకు వెళ్లి వ్యవసాయ సిబ్బంది ద్వారా పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకోవడం వలన పంట కొనుగోలు, ఇన్స్యూరెన్స్, నష్ట పరిహారం, పంట నష్టం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పథకాలకు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఎక్కడా కూడా పంట నమోదు కాలేదనే సమస్య ఉత్పన్నం కాకూడదని సిబ్బందికి సూచించారు.

రైతులు పంట నమోదు చేసుకోవాలి

బద్వేలు అర్బన్ : ప్రతి రైతు తాము సాగు చేసిన పంట వివరాలను ఆయా పంచాయతీ రైతుభరోసా కేంద్రం సిబ్బందితో కలిసి పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయని, రైతులే ఆర్బీకే సిబ్బందితో కలిసి పంట నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు వజ్రాయుధం లాంటిది

ఆర్డీఓ ఆకుల వెంకటరమణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

బద్వేలు అర్బన్ : ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు వజ్రాయుధం లాంటిదని ఇందుకోసం 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటుహక్కును కలిగి ఉండాలని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో విద్యార్థులకు ఓటు హక్కు ఆవశ్యకత పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు జాన్సన్ విక్టర్‌పాల్, బాబా ఫక్రుద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటసుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి జీవనాడి ఓటు

ప్రజాస్వామ్యానికి ఓటు జీవనాడి లాంటిదని మానవ హక్కుల సంఘం సభ్యులు కర్లకూడి కృష్ణ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత మనో విజ్ఞానశాస్త్ర అధ్యాపకులు ఒంగోలుశేషారెడ్డి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గానుగపెంట హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటును నిజాయితీగా వినియోగించుకోవాలి

ప్రతి ఓటరు తన ఓటును ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా వినియోగించుకోవాలని గోపవరం డిప్యూటీ తహసీల్దారు విద్యాసాగర్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ దక్షిణమూర్తి, కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్‌సీసీ ఏఎన్‌ఓలు సుధాకర్‌రెడ్డి, వీరేంద్ర, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు చాలా విలువైనది

రాజుపాళెం : ఓటు హక్కు చాలా విలువైందని, ఎన్నికల సమయంలో తమకు నచ్చిన వారికి ఓటు వేయాలని తహసీల్దార్ ఇందిరారాణి తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ ఓటర్లకు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు.

ఓటు వజ్రాయుధం

ప్రొద్దుటూరు : పౌరుల చేతుల్లో ఓటు వజ్రాయుధం లాంటిదని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ జె.సుభాని తెలిపారు.బుధవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి, రిటైర్డు డిప్యూటీ తహసీల్దార్ శేషాద్రి, రాజశేఖరరెడ్డిలను సీనియర్ ఓటర్లుగా గుర్తించి సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మండల స్థాయి సైన్స్ ఫెయిర్

ఐదు నమూనాలు జిల్లా స్థాయికి ఎంపిక



సైన్స్ ఫెయిర్ నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ పద్మలత

మైదుకూరు : మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం జరిగిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్ అందరినీ ఆకట్టుకుంది. మండలంలోని రెసిడెన్షియల్ ప్రభుత్వ, ఎయిడెడ్ హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఎంఈఓ టీఎం పద్మలత సైన్స్ నమూనాలను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. వనిపెంటలోని జ్యోతిరావు పూలే గురుకుల హైస్కూల్ విద్యార్థులు జి.కావ్య, జి.భావన రూపొందించిన సాఫ్ట్‌వేర్, యాప్‌లు నమూనా, అదే పాఠశాలకు చెందిన బి.శ్రవంతి, కె.స్నేహలత తయారు చేసిన గణిత నమూనాలు, వనిపెంట హైస్కూల్ విద్యార్థులు బి.అయూషత బస్సుమ్,ఎం.నౌసిన్ ప్రదర్శించిన పర్యావరణహిత నమూనా జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయి. అదే విధంగా కె.లక్ష్మీనందిని తయారు చేసిన ఆరోగ్యం పరిశుభ్రత నమూనా, కె.ప్రసన్న లక్ష్మి రూపొందించిన పర్యావరణం, వాతావరణ మార్పులు అనే నమూనా కూడా జిల్లా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయి. సైన్స్ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులను హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

నరసన్నపల్లె ప్రాథమిక పాఠశాల పరిశీలన

బ్రహ్మంగారిమఠం: మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ నరసన్నపల్లె ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. గడప గడపకు కార్యక్రమంలో ఉండగా పాఠశాలకు ఉపాధ్యాయులు సరిగా రావడంలేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రికార్డులు పరిశీలించగా హెచ్‌ఎం విజయకుమారి తరచూ రావడంలేదని, అయినా మరో ఉపాధ్యాయురాలు పాఠశాలకు వచ్చినట్లు రిజిస్టర్‌లో హాజరు వేయడంపై ఎమ్మెల్యే ప్రశ్నించారు. అక్కడే ఉన్న ఎంఈఓ పుల్లయను హెచ్‌ఎంకు నోటీస్ ఇవ్వాలని అలాగే హెచ్‌ఎం రాకున్నా హాజరు వేసిన ఉపాధ్యాయురాలికి మెమో ఇవ్వాలని తెలిపారు.

రెచ్చగొట్టే వీడియోలను ప్రసారం చేస్తే చర్యలు

యూట్యూబర్లకు ఏఎస్పీ ప్రేరణాకుమార్ హెచ్చరిక



ప్రొద్దుటూరు క్రైం : గొడవలకు ఆస్కారం కలిగించే వీడియోలను ప్రసారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఏఎస్పీ విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో కొందరు యూట్యూబర్లు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, గొడవలకు ఆస్కారం కలిగించే వీడియోలను ప్రసారం చేస్తున్నారన్నారు. ఎడిట్ చేయకుండా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడంతో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని చెప్పారు. దీనిపై చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రొద్దుటూరులో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి అందరూ కృషిచేయాలన్నారు. వివిధ పార్టీల నాయకులు, కొందరు వ్యక్తులు మాట్లాడే ప్రసంగాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై ఇప్పటికే చాలా సార్లు హెచ్చరించామన్నారు. వాట్సప్ గ్రూపుల్లో పెట్టే పోస్టులకు అడ్మిన్ పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని చెప్పారు. టూటౌన్ సీఐ ఇబ్రహీం మాట్లాడుతూ కొందరు యూట్యూబర్లు వ్యవహరించే తీరు పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉందన్నారు. కొందరు బ్యాచ్‌లుగా ఏర్పడి బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొందరు బాధితులు తమకు ఫిర్యాదు కూడా చేశారన్నారు. వారి ఫిర్యాదులపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. సీఐలు రాజారెడ్డి, యుగంధర్, ఎస్ఐ కృష్ణంరాజునాయక్ పాల్గొన్నారు.

12న కో–ఆపరేటివ్ స్టోర్స్ ఎన్నికలు

ప్రొద్దుటూరు : ది ప్రొద్దుటూరు సెంట్రల్ కన్స్యూమర్స్ కో–ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ పాలకవర్గం సభ్యుల ఎన్నికలను ఫిబ్రవరి 12న నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇ.అరుణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31న నామినేషన్లు స్వీకరిస్తామని, ఫిబ్రవరి 1న నామినేషన్ల పరిశీలన, 2న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. 12న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల పోలింగ్ నిర్వహించి, అనంతరం ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తామని వివరించారు. 13న పాలకవర్గ సభ్యులను ఎన్నుకుంటారని తెలిపారు. సంఘ సభ్యులు తమ ఓటుక్కును వినియోగించుకోవాలని కోరారు.

ముక్తియార్ మాటలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు, కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిపై టీడీపీ నాయకుడు ముక్తియార్ మాటలు హాస్యాస్పదమని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు వల్లం దాదాపీర్ తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లతో కలసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.ముక్తియార్ ముస్లింలను ఎవరినీ ఎదగనివ్వకుండా, రాజకీయాలను వ్యాపారంగా మార్చుకున్నాడని విమర్శించారు. బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రజనిని విమర్శించే ముందు ముక్తియార్ టౌన్ బ్యాంకుకు కన్నం వేసిన సంఘటనను గుర్తు చేసుకోవాలని సూచించారు. నిన్ను, నీ కొడుకును ప్రజలు తిరస్కరించారన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. 13వ వార్డు కౌన్సిలర్ సికిలిగిరి ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీతోపాటు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని ముక్తియార్ విమర్శించడం తగదన్నారు. 22వ వార్డు ఇన్‌చార్జి హిదాయత్ మాట్లాడుతూ సారా కాంట్రాక్టర్ సంటి వీరారెడ్డి వద్ద పనిచేసిన ముక్తియార్‌కు ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదన్నారు. 25వ వార్డు ఇన్‌చార్జి నూరి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ముస్లింలకు దత్తపుత్రుడు అని, ముక్తియార్ మాత్రం ఉత్త పుత్రుడుగా మిగిలాడని వ్యాఖ్యానించారు. ముస్లింల సంక్షేమానికి పాటుపడుతున్న ఏకైక నాయకుడు ఎమ్మెల్యే రాచమల్లు అని కొనియాడారు. 26వ వార్డు ఇన్‌చార్జి పాలగిరి ఖాజా మాట్లాడారు. సమావేశంలో కౌన్సిలర్లు వల్ల ఖలీల్, కమాల్, మహమ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ నాయకులు మార్కెట్ ఖాసీం, చొసేన్, హనీఫ్, కరీముల్లా పాల్గొన్నారు.

అన్నదానం ఎంతో పుణ్యకార్యం: ఎమ్మెల్యే



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు, పోరెడ్డి

ప్రొద్దుటూరు: పోరెడ్డి సుజాత ఫౌండేషన్ ద్వారా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోరెడ్డి నరసింహారెడ్డి బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరెడ్డి సుజాత ఫౌండేషన్‌ను ఆవిష్కరించారన్నారు. పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా 24న పట్టణంలోని ఎంపిక చేసిన ప్రదేశాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కౌన్సిలర్ ఓబుళరెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్కిరెడ్డి పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వంద అడుగుల ఎత్తులో జాతీయ పతాకావిష్కరణ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరుకే తలమానికంగా నిలవనున్న వంద అడుగుల స్థూపాన్ని పుట్టపర్తి సర్కిల్‌లో రూ.15లక్షలతో ఏర్పాటు చేశారు. 30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో తయారు చేసిన జాతీయ పతాకాన్ని గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం 8.30 గంటలకు ఆవిష్కరించనున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 100 అడుగుల స్థూపం అందరిని విశేషంగా ఆకట్టుకుంటోంది. పట్టణంలో విద్యుత్ స్తంభాలకు అమర్చిన ఎల్‌ఈడీ రోప్ లైట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి తోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు, విద్యార్థులు హాజరు కానున్నారు.

ఉద్యోగులపై దాడి సరికాదు

ప్రొద్దుటూరు క్రైం: ప్రజల కోసం పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం సరైన చర్య కాదని ప్రొద్దుటూరు తాలుకా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు కేజీ రఘురామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 వార్డు సచివాలయంలో పని చేస్తున్న వంశీకృష్ణపై మంగళవారం అదే వార్డుకు చెందిన ఒక వ్యక్తి దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

వేదపాఠశాల విద్యార్థులకు వస్త్రాలు పంపిణీ



నూతన వస్త్రాలతో వేద పాఠశల విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని శైవాగమ వేద పాఠశాల విద్యార్థులకు బుధవారం పట్టణానికి చెందిన సముద్రాల కవిత కుటుంబ సభ్యులు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ మాజీ చైర్మన్ ఎస్.రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ కోసం దేవాలయంలో వేద పాఠశాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో రూ.70లక్షల ప్రభుత్వ నిధులతో వేద పాఠశాలకు భవనం నిర్మిస్తున్నామని, పాఠశాల విద్యార్థులకు దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. వేద పాఠశాల గురువు వెంకటేశ్వర శర్మ పాల్గొన్నారు.